
TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 198 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.12.02.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# గెలుపెవరిది..!




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకొని రణరంగంగా మారాయి. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభంకాగా.. సాయంత్రం 5 గంటల్లోపు క్యూలైన్‌లో నిల్చున్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు పోలింగ్ నిర్వహించగా భారీగానే పోలింగ్ శాతం నమోదైంది. ఈ నెల 13న ఉదయం 8 గంటలకు 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక ఉంటుంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, 13 మున్సిపాలిటీల్లో జరిగిన పోలింగ్ మిశ్రమ అనుభవాలను మిగిల్చింది. అభ్యర్థుల అత్యుత్సాహం, పోలీసుల ఆంక్షలు, ఘర్షణల మధ్య ఎన్నికలు ముగిశాయి. కరీంనగర్, మెట్‌పల్లి, జగిత్యాల ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కరీంనగర్ 58వ డివిజన్‌లో దొంగ ఓట్లపై బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పరిస్థితి చేయి దాటడంతో పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. మెట్‌పల్లి 11వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి కొమిరెడ్డి శేషగిరిని ప్రత్యర్థులు చుట్టుముట్టి, కుర్చీలోంచి లేస్తే ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని బెదిరించారు. జగిత్యాలలో తన ఫోన్ లాక్కున్నారని బీజేపీ రెబల్ అభ్యర్థి పులి శ్రీధర్ కంటతడి పెట్టుకున్నారు.

వేములవాడలో పోలీసులు తనను పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని అధికార పార్టీ అభ్యర్థిని రామతీర్థపు కృష్ణవేణి రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. కరీంనగర్‌లోని 49వ డివిజన్ రాంనగర్ ప్రభుత్వ పాఠశాల పోలింగ్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మశ్రీ భర్త శ్రీనివాస్ రెడ్డి సెల్‌ఫోన్‌ను బీజేపీ అభ్యర్థి, అతని అనుచరులు గుంజుకుని పగలగొట్టారు. విషయం తెలుసుకున్న వెంటనే అక్కడికి చేరుకున్న సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి బీజేపీ నాయకులను నిలదీశారు. పోలీసులు సైతం ఇరుపార్టీ శ్రేణులను సముదా యించారు. 'దండంపెట్టి చెబుతున్న.. వాడ ఆగమైతంది. ఈరోజు కుట్ర తిరుపతిని అరెస్టు చేసేందుకు పోలీసులు వచ్చారు. ఎమ్మెల్యే వచ్చి అడ్డుకున్నారు.

అయ్యా.. కిసాన్‌నగర్ ప్రజల్లారా అర్థం చేసుకోండి. అయ్యలారా.. మీకు దండం పెడతా.. మీ కాళ్లు మొక్కుతా' అంటూ బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల అశోక్ పోలింగ్ కేంద్రం వద్ద నినదించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ వద్ద వీధికుక్కలు దాడికి దిగాయి. ఈ దాడిలో ఆరుగురు పోలింగ్ సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆ కుక్కలను తరిమికొట్టారు. వారిని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కరీంన గర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 58వ డివిజన్ బీఆర్ఎస్ నేతలు దొంగ ఓట్లు వేయిస్తున్నారని బీజేపీ నాయకులు వెళ్లి ఆందోళన చేశారు.

'కవర్' డ్రైవ్ అదిరింది!

ఈ ఎన్నికల్లో అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి డబ్బును నీళ్లలా ఖర్చు చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో ఓటు విలువ ఆకాశాన్ని తాకింది. కరీంనగర్ 2వ డివిజన్‌లో ఒకే ఓటుకు రూ. 6 వేలతో కూడిన కవర్లు పంపిణీ చేయడం గమనార్హం. ఒకే ఇంట్లో నలుగురు ఉంటే రూ. 24 వేలు అందడంతో ఓటర్లే విస్తుపోయారు. ఒక్కో వార్డులో రూ. 10 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు నగదు పంపిణీ జరిగినట్టు అంచనా. హుజూరాబాద్‌లో కొందరు ఓటర్లు అభ్యర్థులకు ఫోన్ చేసి మరి "మాకు డబ్బులు ఎందుకు ఇవ్వలేదు?" అని నిలదీయడం ఎన్నికల తీరుతెన్నులకు అద్దం పడుతోంది. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులో ఓ స్వతంత్ర్య అభ్యర్థి ఓటర్లకు బంగారు నాణేలు పంపిణీ చేశారు. అయితే తీరా వాటిని పరీక్షించగా అవి నకిలీ బంగారం అని తేలడంతో ఓటర్లు అవాక్కయ్యారు. బంగారమని ఆశచూపి తమను మోసం చేస్తారా అంటూ ఓటర్లు సదరు అభ్యర్థిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై అధికారులు విచారణ చేపట్టారు.

నిబంధనలు గాలికి..సోషల్ మీడియాలో వైరల్

ఎన్నికల గోప్యతను తుంగలో తొక్కుతూ హుజూరాబాద్ 2వ వార్డులో ఒక ఓటరు తాను వేసిన ఓటును ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టడం కలకలం రేపింది. అటు వేములవాడలో బీఆర్ఎస్ అభ్యర్థి పోలింగ్ స్లిప్పులపై పార్టీ స్టాంపులు వేసి ప్రచారం చేయడంపై కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

నిజామాబాద్‌లో ఓటేసేందుకు ఆసక్తి చూపని ఓటర్లు

మున్సిపల్ ఎన్నికల్లో ముందు నుంచి భావించినట్టే నిజామాబాద్ అర్బన్ కేంద్రాల్లోని మున్సిపాల్టీల్లో ఓటర్లు ఓటేసేందుకు అంతగా ఆసక్తి చూపలేదు. దాంతో పోలింగ్ శాతం తగ్గింది. చెదురుమదురు ఘటనలు మినహా.. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల వ్యాప్తంగా మున్సిపాల్టీల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అత్యధికంగా ఎల్లారెడ్డిలో 79.77 శాతం, బిచ్కుందలో 78.49 శాతం పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 59.12 శాతం పోలింగ్ నమోదైంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గూపన్‌పల్లి కమాన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. వివిధ పార్టీల నాయకులు భారీగా గుమిగూడటంతో అక్కడ పెద్దఎత్తున ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

రహదారిపై వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు అక్కడ గుమిగూడిన పార్టీ నాయకులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే పోలీసుల విజ్ఞప్తిని పట్టించుకోలేదు.


## ఇకపై ముందుగా వందేమాతరం




న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: ఇకపై ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో జాతీయ గీతం జనగణమన ఆలపించడానికి ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించాలని కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బంకిం చంద్ర ఛటర్జీ రాసిన ఈ వందేమాతరం గేయంలో ఆరు చరణాలనూ పాడాలని ఆదేశించింది. జనవరి 28 తేదీతో విడుదలైన ఈ ఆదేశాల్లో జాతీయ గేయ ఆలాపనకు కొన్ని ప్రోటోకాల్స్ విధించింది. గేయంలోని ఆరు చరణాలను 3నిముషాల 10సెకన్లలో పూర్తి చేయాలని పేర్కొంది. అధికార కార్యక్రమాలు అంటే రాష్ట్రపతి వస్తున్నపుడు, త్రివర్ణపతాకాన్ని ఎగురవేసేటపుడు, గవర్నర్ల ప్రసంగాల సమయంలో ఈ గేయాన్ని ఆలపించాలని పేర్కొంది. దీనికి సంబంధించిన వివరాలు బుధవారం వెలుగులోకి వచ్చాయి.

జాతీయ గేయం, జాతీయ గీతం రెండూ పాడే సమయంలో లేదా ప్లే చేసే సమయంలో ముందుగా వందేమాతరాన్ని ఆలపించడం లేదా ప్లే చేయడం జరగాలని ఆ ఉత్తర్వులు పేర్కొన్నాయి. ఆ సమయంలో అందరూ లేచి నిలబడాలని పేర్కొంది. అయితే న్యూస్‌రీల్ లేదా డాక్యుమెటరీ ప్రదర్శన సమయంలో భాగంగా జాతీయ గీతాలాపన వస్తుండగా, అప్పుడు లేచి నిలబడాలని భావించనక్కర లేదని అలా చేయడం వల్ల ఆ ప్రదర్శనకు ఆటంకం కలుగుతుంది. పైగా జాతీయ గేయానికి గౌరవం బదులు గందరగోళం ఏర్పడుతుందని ఆ ఉత్తర్వులు పేర్కొన్నాయి. జాతీయ గేయం ఆలాపనతోనే పాఠశాలలో తరగతులు ఆరంభమవ్వాలి. వందేమాతరం 150వ వార్షికోత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. జాతీయ గేయాన్ని పాడే అన్ని సందర్భాల్లోనూ అధికార వర్షన్‌ను మాత్రమే ఆలపించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## జగ్గారెడ్డిపై ఎన్నికల సంఘం ఆగ్రహం..



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సంగారెడ్డిలో జగ్గారెడ్డి వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. ఆయన కామెంట్స్ ఓటర్ల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొంది. ఆయనపై కేసు నమోదు చేసి, రిపోర్ట్ ఇవ్వాలని జిల్లా ఎస్పీని ఆదేశించింది. కాగా సీఐ కాంగ్రెస్ అభ్యర్థి చొక్కా పట్టుకున్నారంటూ పోలీసులపై జగ్గారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ ఆపుతానంటూ పోలింగ్ కేంద్రంలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే.

## మున్సిపల్ ఎన్నికల్లో మనదే జెండా



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రెండేండ్ల ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని విశ్వసిస్తూ పార్టీకి పట్టం కట్టబోతున్నట్టు వివరించారు. బుధవారం సాయంత్రం న్యూఢిల్లీలో ఖర్గే నివాసంలో ఆయనను సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. ఈ భేటీలో సీఎం రేవంత రెడ్డి వెంట ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, అనిల్ కుమార్ ఉన్నారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ భేటీలో తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ భారీ మెజార్టీ సాధించనుందని ఖర్గేకు సీఎం వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అందువల్ల పంచాయితీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే, మున్సిపల్ లోనూ పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేసినట్టు తెలిసింది. అనంతరం పార్టీ అధ్యక్షులు ఖర్గేతో సీఎం కాసేపు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, మున్సిపల్ ఎన్నికల తీరు, సాధించే సీట్లపై మరింత లోతుగా చర్చించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు నోటీసులు, ఆ తర్వాత పరిణామాలను ఖర్గేకు వివరించినట్టు తెలిసింది. అలాగే క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించినట్టు సమాచారం. పంచాయితీ, మున్సిపల్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మంత్రి వర్గ విస్తరణ, శాఖల మార్పుపై కూడా చర్చకు వచ్చినట్టు తెలిసింది. కాగా.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ పనితీరును ఖర్గే అభినందించారు. ఎన్నికల కోసం కాకుండా, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా పాలన చేస్తున్నారని సీఎం, మంత్రులను మెచ్చుకున్నారు. ముఖ్యంగా కుల వివక్షను రూపుమాపేలా, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఆలోచనను ఖర్గే అభినందించినట్టు తెలిసింది.

నేడు రాహుల్, కేంద్ర మంత్రులతో సీఎం భేటీ

ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టనున్నట్టు తెలిసింది. ప్రధానంగా తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిన విషయం తెలిసిందే. ప్రధానంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తో పాటు రాష్ట్రంలో విద్యా సంస్థల అభివృద్ధికి ఆర్థిక సాయం చేయాలని సీఎం తో పాటు, మంత్రులు కేంద్రాన్ని కోరారు. అలాగే విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని కోరారు. కానీ, కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రాలకు కేటాయింపులు కాకుండా శాఖల వారిగా కేటాయింపులు చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోన్న పథకాలకు ఆర్థిక సాయంతో పాటు, విద్యా సంస్థల డెవలప్‌మెంట్ కు ఎఫ్ఆర్ బీఎం పరిధి మినహాయింపు, విభజన హామీలపై సీఎం మరోసారి కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయనున్నట్టు తెలిసింది. అలాగే ఏపీ, తెలంగాణ మధ్య జల వివాదాల పరిష్కారం కోసం సీఎం ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిసింది.

తాజాగా ఏపీం సీఎం చంద్రబాబు పోలవరం-నల్లమల్ల సాగర్ లింక్ ప్రాజెక్ట్ అనుమతులకై కేంద్రంపై ఒత్తిడి పెంచిన నేపథ్యంలో ఆ ప్రాజెక్ట్ అనుమతుల విషయంలో తెలంగాణ అభ్యంతరాలను ఆ శాఖమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్టు సమాచారం.

ఇందులో భాగంగా కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ , ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జెపి నడ్డా, జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆహార పంపిణీ శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి ల అపాయింట్‌మెంట్ లను కోరినట్టు తెలిసింది. అలాగే లోక్‌సభలో బీజేపీ సర్కార్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గొంతు నొక్కుతోన్న నేపథ్యంలో రాహుల్ గాంధీని కలిసి మద్దతు తెలపనున్నట్టు సమాచారం.

## మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం




సూర్యాపేట :అమృత్ తెలంగాణ: అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బీఆర్ఎస్ తమ ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలు రాష్ట్ర పరిపాలన వైఫల్యానికి నిదర్శనమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీనా, బీఆర్ఎస్ పార్టీయా అన్న స్పష్టత కూడా ప్రభుత్వానికి లేదని అన్నారు. బీఆర్ఎస్.. కాంగ్రెస్ మంత్రుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారనడం సిగ్గుచేటని, ఈ వ్యాఖ్యలతోనే పోలీసింగ్ వ్యవస్థ పనితీరు ప్రశ్నార్థకమవుతోందన్నారు. హోంమంత్రి చేతకానితనం మంత్రుల మాటల ద్వారానే బయట పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసులకు, అధికారులకు స్వేచ్ఛ లేదని, రాజకీయ ఒత్తిళ్లతో వ్యవస్థను నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రుల ఫోన్లు ట్యాపింగ్ జరుగుతున్నాయని బీఆర్ఎస్ మొదటి నుంచే చెబుతోందని, ఇప్పుడు అదే విషయాన్ని కాంగ్రెస్ నాయకులే ఒప్పుకుంటున్నారని వ్యాఖ్యానించారు. పోలీసు వ్యవస్థను అడ్డంపెట్టి బీఆర్ఎస్‌పై దాడులు చేయిస్తున్నారని, పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయిలో అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల్లో సహకరించాలని కోరడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని, రాత్రివేళల్లో కాంగ్రెస్ గుంపులు బైక్‌లపై సంచరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఓటమి భయంతో ఉద్యోగులను ప్రభావితం చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోయేది కేసీఆర్ రాజ్యమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జెడ్పీమాజీ వైస్‌చైర్మెన్ గోపగాని వెంకట నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా కూల్చివేత చట్ట ప్రకారం లేదు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ:వివాదాస్పద స్థలానికి సంబంధించి మున్సిపల్ శాఖ అనుమతి లేకుండా కాంపౌండ్‌ను కూల్చివేయడం చట్ట వ్యతిరేకమని హైకోర్టు పేర్కొంది. ఆక్రమణలైనా తొలగించే ముందు నోటీసులు ఇవ్వాల్సిందేనని చెప్పింది. ప్రయివేటు వ్యక్తుల కాంపౌం డ్‌ను కూల్చి వేసి ఏర్పాటు చేసిన కంచెను తమ ఉత్తర్వులు అందిన 48 గంటల్లో తొలగించాలని ఆదేశించింది. అయితే అక్కడ ఏర్పాటు చేసిన బోర్డును యథాతథంగా ఉంచవచ్చని తెలిపింది. కోర్టులో ఉన్న కేసుకు చెందిన స్థలం వద్ద కాంపౌండ్ వాల్ కూల్చడాన్ని తప్పుపట్టింది. రంగారెడ్డి జిల్లా నార్సింగ్ ప్రాంతంలో ఉన్న స్థలానికి సంబంధించి కూల్చివేతలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు, హైడ్రా పురపాలక శాఖ మార్గదర్శకాలకు లోబడి పనిచేయాలన్నారు.

# పోలింగ్ కేంద్రాల తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్





పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. రవి హైస్కూల్, ప్రిన్స్ హైస్కూల్, టీఎన్జీఓ హాల్, ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. పోలింగ్ సరళిని స్వయంగా గమనించిన కలెక్టర్, ఓటర్లు ఎక్కువగా ఉన్న కేంద్రాల్లో ఓటింగ్ వేగంగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులకు ప్రాధాన్యత కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సిన బాధ్యత అందరిదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద ఓటర్లతో ఫోటోలు దిగారు. తొలిసారి ఓటు హక్కు వినియోగిస్తున్న యువతను, వయోవృద్ధ ఓటర్లను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి ఐప్వా జిల్లా కన్వీనర్ లక్ష్మి

నిర్మల్ జిల్లా ఫిబ్రవరి 10 అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 12న దేశవ్యాప్త కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం (ఐప్వా) జిల్లా కన్వీనర్ మెంగ లక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికుల చట్టాలను, హక్కులను కాల రాస్తున్నాయని ఆమె విమర్శించారు. కనీస వేతనాలు లేకుండా చేయడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థల కోసం ప్రభుత్వం పని చేస్తుందని, అందులో భాగంగానే కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్స్ ను తీసుకు వచ్చారని ఆమె అన్నారు. ఉత్పత్తిలో పురుషులతోపాటు మహిళల పాత్ర కీలకమైందని, సమాజ అభివృద్ధిలో మహిళలు ముందున్నారని లక్ష్మి తెలిపారు. లేబర్ కోడ్స్ అమలు అయితే మహిళలకు భద్రత ఉండదని, కార్మిక సంక్షేమం భద్రత కనీస వేతనాలు అమలుకావని, కార్మికుల పాలిట శాపంగా మారిన లేబర్ కోడ్సు తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కుట్రపూరితంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని మార్చిందని, విబి రామ్ జి పేరుతో తీసుకువచ్చిన బిల్లు అత్యంత ప్రమాదకరమైందని, కూలీల ఉపాధిని లాక్కునే దీనిని తిరస్కరించాలని, కార్మికుల హక్కుల కోసం, కనీస వేతనాల కోసం, భద్రత కోసం, సంక్షేమం కోసం మహిళా లోకం పెద్ద



ఎత్తున దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# నిర్మల్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు......





మున్సిపల్ ఎన్నికలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ జిల్లా ఫిబ్రవరి 11 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని, మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లాలో సగటున 42 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం భైంసాలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడి కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఓటు వేయడానికి వచ్చిన వారిని అభినందించారు. పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో పోలింగ్ ఉత్సాహంగా కొనసాగుతోందని తెలిపారు. భైంసా మున్సిపాలిటీలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు 43 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. భైంసాలో ఏర్పాటు చేసిన గ్రీన్ పోలింగ్ స్టేషన్‌ను కలెక్టర్ ప్రశంసించారు. పర్యావరణ హితంగా, ఆకర్షణీయంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు వెతికే విషయంలో ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌డెస్క్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనున్నందున అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీలలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కంట్రోల్ రూమ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.



జిల్లా అధికారులతో కలెక్టర్ అభిలాష అభినవ్

# మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం స్థానిక సాత్నాల క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వార్డు నంబర్ 38, పోలింగ్ స్టేషన్ నంబర్ 170 వద్ద ఆయన సామాన్య ఓటరుల్లా వరుసలో నిలబడి ఓటు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు




ఓటు హక్కును వినియోగించుకున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు రవీంద్ర నగర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వులు, ఉత్సాహాన్ని గమనిస్తే భారతీయ జనతా పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు అందిస్తున్నారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారికి కానుకగా ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ పదవిని బీజేపీ గెలుచుకుంటుందని ప్రజలు నమ్మకంతో ఉన్నారని తెలిపారు. అదేవిధంగా, ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి పూర్తిస్థాయిలో జరగాలంటే బీజేపీ పాలన మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజలందరూ బీజేపీకి ఓటు వేసి అభివృద్ధి బాటలో అడుగులు వేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

## సమస్యాత్మకంగా గుర్తించిన భైంసాలో కూడా ఒక్క అవాంఛనీయ ఘటన లేకుండా ఎన్నికల నిర్వహణ

## ఎన్నికల నియమావళి ఇంకా అమలులో ఉంది - ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

## జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి నిర్మల్ జిల్లా పరిధిలో నిర్వహించిన నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగాయి. ఎన్నికల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ విస్తృత భద్రతా చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా సమస్యాత్మకంగా గుర్తించిన భైంసా ప్రాంతంలోనూ ఒక్క చిన్న ఘటన కూడా జరగకుండా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మార్గదశకంలో జిల్లా పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసింది. ముందస్తు ప్రణాళిక, నిఘా వ్యవస్థ, నిరంతర పర్యవేక్షణ, ఫ్లాగ్ మార్చ్‌లు, సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాల మోహరింపు వంటి చర్యలతో ఎన్నికలు శాంతియుతంగా సాగాయి. జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ స్వయంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించడంతో పాటు అధికారులకు తగిన మార్గదర్శకాలు అందించారు.పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, మొబైల్ పట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీమ్‌ల ఏర్పాటు ద్వారా ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా చర్యలు తీసుకున్నారు.




ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ...

ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియలేదు, ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) కార్యక్రమం ఇంకా కొనసాగాల్సి ఉంది. అందువల్ల ఎన్నికల ప్రవర్తనా నియమావళి (వీశీసవశ్రీ జశీసవ శీట జశీఅసబవ్ష్) అమలులోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి సంఘ విద్రోహ చర్యలకు, గందరగోళాలకు లేదా చట్ట విరుద్ధ కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఇవ్వబడదు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ లిడా.జి.జానకి షర్మిల హెచ్చరించారు.

# బోథ్ శివభక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి రూ.34 లక్షలు మంజూరు

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ బోథ్ పట్టణంలోని శివభక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.34 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ మంజూరు పత్రాలను మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి గారు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఆలయ అభివృద్ధికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొడ్డు గంగా రెడ్డి, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్,



బోథ్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అన్నపూర్ణ మహేందర్,మాజీ ఎంపీటీసీ చాట్ల ఉమేష్,మాజీ సర్పంచ్ నరింహ దాస్,ఉప సర్పంచ్ పుండ్రు విజయలక్ష్మి రాజా రెడ్డి, వార్డు సభ్యులు బిట్లింగు గిరీష్, కట్కూరి సాయి,దొర భవాని రమేష్,ఆత్మ డైరెక్టర్ రహిమొద్దీన్,నాయకులు మొహమ్మద్,బొజ్జ సాయన్న, బారె నాగేందర్,యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి, యండి సద్దాం ,మౌలానా, రామ్ లక్కన్, మరియు పద్మశాలి సంఘం కుల బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

# మిత్రుడు మృతి.. రూ. లక్ష ఆర్థిక సాయం

ఉప్పునుంతల :అమృత్ తెలంగాణ: 1999--2000 ఎస్ఎస్సి బ్యాచ్ ఉప్పునుంతల జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన మిత్రుడు, ఉప్పునుంతల మండలం జప్తి సదగోడు గ్రామానికి చెందిన కోట్ల చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం నిర్వహించిన దశదినకర్మ సందర్భంగా ఎస్ఎస్సి బ్యాచ్ మిత్రులు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతి చెందిన



చంద్రయ్యకు ఇంటర్మీడియేట్ చదువుతున్న కూతురు కల్పన ఉండటంతో, ఆమె చదువులకు ఈ ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడుతుందని క్లాస్మేట్ మిత్రులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన మిత్రులు గతంలో కూడా పలు సందర్భాల్లో ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

# గురుభక్తికి గౌరవార్చనగా స్వర్ణ వివాహ మహోత్సవం

నవాబుపేట: అమృత్ తెలంగాణ:గురువు--శిష్య బంధం ఎంత పవిత్రమో చాటి చెప్పే అరుదైన సంఘటన నవాబుపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. చిన్నతనంలో ట్యూషన్ కోసం వెళ్లిన శిష్యుడిని అనంతరం తమ సంతానంలా చేరదీసుకున్న గురుదంపతుల 50వ వివాహ వార్షికోత్సవాన్ని ఆ దంపతుల కుటుంబ సభ్యులతో కలిసి దత్తపుత్రుడు ఘనంగా నిర్వహించి అందరి హృదయాలను హత్తుకున్నాడు.

నవాబుపేట మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా సమర్థవంతంగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఎస్. సరస్వతి, బి. అనంతకృష్ణ దంపతులు విద్యాసేవతో పాటు ఆధ్యాత్మిక సేవలోనూ ప్రత్యేక గుర్తింపు పొందారు. షిరిడి సాయిబాబా, పుట్టపర్తి సాయిబాబా భక్తులైన వీరు తరచూ షిరిడి, పుట్టపర్తి క్షేత్రాలకు వెళ్లి దర్శనం చేసుకుంటూ భక్తి మార్గంలో ముందుకు సాగుతున్నారు.

వీరి ఆధ్యాత్మిక సేవలో భాగంగా నవాబుపేట మండల కేంద్రానికి చెందిన బృంగి రవీందర్ వ్యవసాయ క్షేత్రంలో షిరిడి సాయి దేవాలయాన్ని నిర్మించి, షిరిడి సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్టించారు, అలాగే సత్యసాయి బాబా ప్రతిమను నెలకొల్పారు. ఆలయంలో ప్రతిరోజూ పూజలు జరిగేలా అవసరమైన ఏర్పాట్లను నేటికి కూడా సరస్వతి మేడం స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.ప్రతి సంవత్సరం గురుపౌర్ణమి వేడుకలను గ్రామ ప్రముఖులతో కలిసి ఘనంగా నిర్వహించడం ఈ దంపతుల ప్రత్యేకత.

సంతానం లేని ఈ దంపతులు చిన్నతనంలో ట్యూషన్‌కు వచ్చిన కె. యాదయ్యను తమతోపాటు ఇంట్లో ఉంచుకొని విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత చదువులు చదివించారు.



అనంతరం గాయత్రి అనే యువతితో వివాహం జరిపించారు. యాదయ్య--గాయత్రి దంపతులకు ఒక పాప, ఒక బాబు జన్మించారు. యాదయ్యను తమ కన్నకొడుకులా చూసుకుంటూ ఇల్లు, భూమి తదితర సౌకర్యాలను కల్పించారు.

గురుదంపతుల అపారమైన ప్రేమకు కృతజ్ఞతగా బుధవారం వారి స్వర్ణ వివాహ మహోత్సవంను యాదయ్య ఉపాధ్యాయ దంపతుల కుటుంబాల సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఉపాధ్యాయ దంపతుల సహచర విశ్రాంత ఉపాధ్యాయులు, బంధుమిత్రులతో పాటు పూర్వ విద్యార్థులు, మండల ప్రముఖులు పాల్గొని గురుదంపతులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, వారి సేవలను కొనియాడారు.ఈ వేడుక గురు--శిష్య బంధానికి ప్రతీకగా నిలిచింది. "గురువు దైవసమానం" అనే నానుడికి జీవం పోసిన ఈ సంఘటన స్థానికుల ప్రశంసలను అందుకుంది.

# పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా ఎస్పీ

## ఓటు హక్కును వినియోగించుకొని, ఆదర్శంగా నిలిచిన జిల్లా ఎస్పీ.

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి బాధ్యతాయుతమైన సమాజాన్ని నిర్మాణానికి తమ వంతు పాత్ర పోషించాలని సూచన. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తన ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకొని ఆదర్శంగా నిలిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 4వ వార్డ్‌కు సంబంధించిన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించు కోవాలని, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ఓటు కీలకమని జిల్లా ఎస్పీ సూచించారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




ఓటు హక్కును వినియోగించుకున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

# పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించాలి

మిడ్జిల్ :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలని, టాలెంటు ఉన్న పేద విద్యార్థులకు చేయూత అందిస్తామని హైకోర్టు లాయర్ గీతా జగన్నాథ్, లాయర్ బిల్ గేట్స్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం విద్యపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్నిటికీ మూలం విద్యనేనని విద్య ద్వారానే గ్రామం దేశం అభివృద్ధి చెందుతుందని ప్రతి ఒక్క విద్యార్థి తనకున్న టాలెంట్ను పదవ తరగతి పరీక్షల్లో రాణించాలని సూచించారు.

ప్రతి విద్యార్థి కూడా క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలని, అధ్యాపకులు చెప్పే ప్రతి పాఠాన్ని ఏకాగ్రతతో వింటేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నది నిరుపేద విద్యార్థులేనని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని నైపుణ్యత గుర్తించి వారికి అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలని చెప్పాలని కోరారు. పాఠశాలలో పదవ తరగతిలో మొదటి స్థానంలో వచ్చిన విద్యార్థులకు పారితోషకాన్ని అందజేస్తామని చెప్పారు.



అనంతరం మండల మండల కేంద్రానికి చెందిన బరిగల బిల్ గేట్స్ రెడ్డి లండన్ లో చదువుకొని మొదటిసారి ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సరస్వతి హైకోర్టు లాయర్ ఉమాదేవి, గ్రామ పెద్దలు రుతమ్మ, రాజారత్నం, ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీశైలం, నరసింహులు, కోటయ్య, జానకమ్మ, , అరుణ, రాజాలక్ష్మి, మేఘమాల, సౌందర్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం పట్ల అవగాహన అవసరం




బల్మూరు : అమృత్ తెలంగాణ: చదువుతున్న యువకులు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని అప్పుడే చుట్టుపక్కల వారికి ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కల్పించే అవకాశం ఉంటుందని అచ్చంపేట అదనాపు డిఎంహెచ్వో తార సింగ్ అన్నారు. బుధవారం ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోడలాగుల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆరవ రోజు కార్యక్రమంలో భాగంగా మండలంలోని తోడేళ్లగడ్డ సీతారాంపూర్ గ్రామాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమావేశం కళాశాల ప్రిన్సిపాల్ రవి పరంగి గారి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వైద్యులు విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య పోషకాహారం, రక్తహీనత నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు, మానసిక ఆరోగ్య పరిరక్షణ వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యువత ముందుండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం శ్రీలత రమేష్ , స్కూల్ హెడ్‌మాస్టర్ విష్ణు ,గ్రామ కార్యదర్శి యాదమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల జాన్ బాబు గారు, వెంకటయ్య అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

భువనగిరి కలెక్టరేట్ :అమృత్ తెలంగాణ: యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో బుధవారం జరిగిన 2 వ సాదారణ మున్సిపాలిటీ ఎన్నికలు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని 104 వార్డులకు గాను 350 మంది బరిలో నిలిచారు. 202 పోలింగ్ స్టేషన్లో ఎన్నికలు నిర్వహించగా 1,32,711 మంది ఓటర్లకు గాను 1,13, 398 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, జిల్లా మొత్తం 87.1 శాతంగా పోలింగ్ శాతం నమోదయింది. భువనగిరి మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులకు గాను 157 మంది బరిలో నిలిచారు. రెండవ విడత సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులు నువ్వా -- నేనా అన్నట్టు ప్రచారం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు మందకోడిగా కొనసాగింది. మధ్యాహ్నం నుంచి పోలింగ్ పుంజుకుంది. ఉదయం 9 గంటల వరకు ఆలేరు లో 11 శాతం, భువనగిరి లో 9 శాతం, చౌటుప్పల్ లో 11 శాతం, మోత్కూరు లో 12 శాతం, పోచంపల్లి లో 7 శాతం, యాదగిరిగుట్ట లో 14 శాతంగా నమోదయింది.

ఉదయం 11 గంటలకు ఆలేరు లో 27 శాతం, భువనగిరి లో 31 శాతం, చౌటుప్పల్ లో 33 శాతం, మోత్కూరు లో 35 శాతం పోచంపల్లి 24 శాతం, యాదగిరిగుట్టలో 36 శాతం నమోదయింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆలేరులో 52 శాతం, భువనగిరిలో 47 శాతం ,చౌటుప్పల్ లో 60 శాతం ,మోత్కూర్లో 58 శాతం, పోచంపల్లిలో 51 శాతం యాదగిరిగుట్టలో 58 శాతం గా నమోదయింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆలేరులో 73 శాతం, భువనగిరిలో 67 శాతం , చౌటుప్పల్ లో 79 శాతం, మోత్కూరులో 76 శాతం, పోచంపల్లిలో 63 శాతం,



యాదగిరిగుట్టలో 78 శాతంగా నమోదయింది. సాయంత్రం ఐదు గంటల వరకు ఆలేరు లో 85.81శాతం, భువనగిరి లో 82.93 శాతం, చౌటుప్పల్ లో 91.91శాతం, మోత్కూరు లో 86.92 శాతం, పోచంపల్లి లో90.95 శాతం, యాదగిరిగుట్ట లో 89.86 శాతంగా నమోదైంది. జిల్లాలో అత్యధికంగా చౌటుప్పల్ లో 91.91శాతం, అత్యల్పంగా భువనగిరి లో 82.93 శాతంగా నమోదైంది. జిల్లాలో మొత్తంగా 87.01 శాతంగా పోలింగ్ జరిగింది.

# పది ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం: డీఈఓ




ఉప్పునుంతల :అమృత్ తెలంగాణ: నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా సబ్జెక్టు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ సూచించారు. మంగళవారం అచ్చంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మహాత్మ బిసి జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, పలకపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఉప్పునుంతల జెడ్పీహెచ్ఎస్‌లో కొనసాగుతున్న పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించి, సబ్జెక్టుల వారీగా సిలబస్ పూర్తయ్యిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు సమయానికి పౌష్టికాహారం అందించాలని సూచించారు.

డీఈఓ మాట్లాడుతూ.. గుణాత్మక బోధనతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. తరగతి గదులు పరిశుభ్రంగా ఉంచి అనుకూల వాతావరణం కల్పించాలని, పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.

మార్చి 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నందున ప్రతిరోజూ చిన్న పరీక్షలు నిర్వహించి విద్యార్థులను సన్నద్ధం చేయాలని, ప్రతి పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు.

# చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగింపు..

చౌటుప్పల్ .అమృత్ తెలంగాణ: చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికలు బుధవారం ఉదయం 7 గంటలకు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు విజయవంతంగా ముగిశాయని జిల్లా ఎన్నికల సహాయ అధికారి చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకటరామిరెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా సాగిందని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు.

చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 19 వార్డులకు గాను మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మున్సిపాలిటీలో మొత్తం 25,801 మంది ఓటర్లు ఉండగా, అందులో 12,838 మంది పురుషులు, 12,963 మంది మహిళా ఓటర్లు ఉన్నారని అధికారులు వెల్లడించారు.ఉదయం నుంచే ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.ఎన్నికల అధికారులు ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని ప్రకటించారు. ఉదయం 9 గంటలకు 3,074 ఓట్లు పోలై 11.91 శాతం నమోదైంది. ఉదయం 11 గంటలకు 8,734 ఓట్లు పోలై 33.85 శాతం నమోదైంది. మధ్యాహ్నం 1 గంటకు 15,720 ఓట్లు పోలై 60.93 శాతం నమోదైంది. మధ్యాహ్నం 3 గంటలకు 20,470 ఓట్లు పోలై 79.28 శాతం నమోదైంది. సాయంత్రం 5 గంటలకు మొత్తం 23,713 ఓట్లు పోలై 91.91 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల సహాయ అధికారి వెంకటరామిరెడ్డి తెలిపారు.14వ వార్డు పోలింగ్ స్టేషన్ 28లో మధ్యాహ్నం 1:45 గంటల సమయంలో ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులు తీశారు.

20వ వార్డు పోలింగ్ స్టేషన్ 39 వద్ద ముస్లిం మహిళలు గంటకు పైగా క్యూలో నిలబడి ఓటు వేసిన పరిస్థితి కనిపించింది.బీసీ కాలనీ పోలింగ్ బూత్ వద్ద బీఆర్ఎస్ అభ్యర్థులను పోలింగ్ స్టేషన్‌లోకి అనుమతించలేదని ఆరోపిస్తూ పార్టీ నాయకులు పోలీసులతో స్వల్ప



వాగ్వాదానికి దిగారు.అయితే పరిస్థితిని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకొచ్చారు.వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సిబ్బంది ప్రత్యేక సదుపాయాలు కల్పించారు.వీల్‌చైర్ల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లి ఓటు వేయించేలా సహకరించారు.బంగారిగడ్డ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్లు భారీగా బారులు తీశారు. సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత కూడా పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లకు సీరియల్ నంబర్లతో స్లిప్పులు ఇచ్చి, వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆర్డీవో వెల్మ శేఖర్ రెడ్డి, స్థానిక తహసిల్దార్ వీరాబాయి పర్యవేక్షణలో, చౌటుప్పల్ డీఎస్పీ పటోళ్ల మధుసూదన్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో ఆరు రూట్లలో సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీసులు, హోంగార్డులు విధులు నిర్వహించారు. మొత్తం మీద చౌటుప్పల్ మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా, భారీ ఓటింగ్ శాతంతో ముగిశాయని జిల్లా ఎన్నికల సహాయ అధికారి గుత్తా వెంకటరామిరెడ్డి తెలిపారు.

# కొంపల్లి పార్వతి రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల కరపత్ర ఆవిష్కరణ..

మునుగోడు: అమృత్ తెలంగాణ:కొంపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 15 నుండి 19 వరకు శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలవాల్ పోస్టర్స్, కరపత్రాల దాతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెదిరే విజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కొంపల్లిలో ఐదు రోజులపాటు మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలిరావాలని కోరారు. బ్రహ్మోత్సవాలలో సాంప్రదాయ సంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రితిక హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మొగుదాల నరసింహ గౌడ్ సహకారంతో నియోజవర్గ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు యువకులు పాల్గొని తమ ప్రతిభ కనబరిస్తే మొదటి బహుమతి 30 వేలు , రెండవ బహుమతి 15 వేలు , మూడవ బహుమతి 7500 అందించనున్నట్టు తెలిపారు . ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్ లు జీడిమడ్ల నరేష్ , జీడిమడ్ల మౌనిక సురేష్, సూర శ్రీశైలం , మాజీ సర్పంచ్ బోయపర్తి లింగయ్య , గ్రామ ప్రజలు జీడిమడ్ల వెంకటయ్య , వడ్డేపల్లి శంకర్ , సుర శంకర్ , సంకు శంకర్ , మొగుదాల రాంప్రసాద్ , సూర శ్రీశైలం , డి శంకర్ , చుక్క శంకర్,చుక్క నరేందర్ , వెంకటయ్య తదితరులు ఉన్నారు.

# హాట్సాఫ్ తల్లి..



ఇబ్రహీంపట్నం :అమృత్ తెలంగాణ: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం తన బాధ్యతగా గుర్తించిన ఓ కవల పిల్లల తల్లి నగరం నుంచి వచ్చి ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చి మూడు నెలలు కూడా కాకునా సుమారు యాభై కిలోమీటర్ల దూరంలోని రాజేంద్రనగర్ నుంచి ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని శేరిగూడ 15వ వార్డులో తన అక్క శివానితో కలిసి వచ్చారు. ఇరువురు కలిసి శేరిగూడలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా తమ కూతురు నగరంలోని రాజేంద్రనగర్ నుండి ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని శేరిగూడలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వస్తున్న తరుణంలో వారి తల్లిదండ్రులు సైతం వారికి తోడుగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకునేందుకు సహకరించారు. 14, 15, 16వ పోలింగ్ స్టేషన్ కేంద్రాల్లో మహిళా ఉద్యోగులే ఎన్నికల సిబ్బంది ఉండటం వల్ల సంధ్య మూడు నెలల చిన్నారులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నందుకు పోలింగ్ కేంద్రానికి రావడం పట్ల మహిళ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు ఆమెకు హాట్సాఫ్ తెలిపారు.

# నా ఓటు ఏవరేశారో..



ఇబ్రహీంపట్నం :అమృత్ తెలంగాణ: మున్సిపాలిటీ ఎన్నికల్లో తన ఓటు ను వేరేవాళ్లు వేశారంటూ ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడలోని 15వ వార్డులో ఓటు వేసేందుకు వెళ్లిన క్యామ పారిజాతకు చేదు అనుభవం ఎదురైంది. ఓటేసి తమకు కావాల్సిన నేతను ఎన్నుకునేందుకు గ్రామంలోని పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి క్యూలో నిలబడింది. తీరా తన వొంతు రాగానే ఓటు వేసేందుకు పేరు వివరాలు తెలుపగా.. ఆ ఓటు అప్పటికే పోల్ అయినట్లు అధికారులు చెప్పడంతో సదరు మహిళా ఓటరు ఒక్కసారిగా అవాక్కయ్యింది.

# సీతారాంపేటలో యుద్ధరంగం



ఇబ్రహీంపట్నం :అమృత్ తెలంగాణ: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కు ముందే సీతారాంపేటలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యలో యుద్ధ వాతావరణం నెలకొంది. పోలీసులు, కాంగ్రెస్ నాయకుల చర్లపై భారీ స్థాయిలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. ఇతర గ్రామాల నాయకులను బయటికి పంపించకపోతే ఇక్కడే బైటాయిస్తానని బీఆర్ఎస్ నేత బంటి ఆద్వర్యంలో కార్యకర్తలు ఆందోళన దిగారు. దాంతో సీతారాంపేటలో ఒక్కసారిగా యుద్ధ వాతావరణం నెలకొంది. దాంతో అర్ధరాత్రి సీతారాంపేటలో యుద్ధాన్ని తలపించే విధంగా పరిస్థితులు నెలకొన్నాయి. అందుకు సంబంధించిన వివరాలు.

ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డుపై ఎవరి అంచనాల వారికే ఉన్నాయి. ఇగ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య నువ్వా.. నేనా అనే రీతిలో పోటీ నెలకొంది. ఈ తరుణంలో ఈ నెల 11వ తేదీన పోలింగ్ ప్రారంభం కానున్న తరుణంలో ఇరు పార్టీల నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బులు పంపిణీకి తెరలేపారు.

కాగా బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న టేకుల సుదర్శన్ రెడ్డిని మాత్రం ప్రచారానికి సమయం మించిపోయిందని బయటకు రావద్దని పోలీసులు తన ఇంటిలోకి పంపించేశారు. ఆయనను ఇంట్లో నుంచి బయటికి రానియ్యకుండా అడ్డుకున్నారని, ఇదే తరుణంలో ఒక్కసారిగా అబ్దుల్లాపూర్ మెట్టు, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు దాదాపు ఐదారు వాహనాల్లో గ్రామంలోకి వచ్చి డబ్బులు పంపిణీ చేస్తున్నారని బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి టేకుల సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. ఇదే విషయాన్ని తన పార్టీ అధిష్టానానికి సమాచారం ఇవ్వడంతో భారీ స్థాయిలో మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి తన పార్టీ కార్యకర్తలతో ఒక్కసారిగా సీతారాంపేట గ్రామానికి చేరుకున్నారు. టేకుల సుదర్శన్ రెడ్డి ఇంటి వద్ద ఉన్న పోలీస్ పికెటింగ్ వద్దకు చేరుకొని పరిస్థితిపై పోలీసులు నిలదీశారు. ఓ పక్క అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేయిస్తూ.. బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిగా ఉన్న తనని మాత్రం గృహ నిర్బంధంలోకి నెట్టడం ఏమిటని నిలదీశారు. అక్కడే తన పార్టీ కార్రోయకర్తలతో రోడ్డుపై బైఠాయించారు. ఇతర గ్రామాలను చెందిన కాంగ్రెస్ నాయకులను గ్రామం నుంచి పంపించకపోతే ఇంటింటి తిరిగి తామే పంపించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారం ప్రారంభం నుండి పోలీసుల చర్య సరిగ్గా లేదని తమ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయడమే కాకుండా, తమ అభ్యర్థులను కూడా ప్రచారం చేయకుండా అడ్డుకుంటున్నారని ఆందోళనకు దిగారు. మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డిని సముదాయించి గ్రామం నుంచి పంపించే ప్రయత్నం చేశారు. ఇతర గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సీతారాంపేటలో ఎవరున్నా, వారిని గ్రామం నుండి పంపించి వేస్తామని ఆందోళన విరమించాలని పోలీసులు సూచించారు. ముందు ఆ గ్రామ నాయకులను గ్రామం నుండి బయటకు పంపించిన తర్వాతనే తాము కూడా తన పార్టీ కార్యకర్తలను గ్రామాన్ని విడిచి వెళ్తానని భీష్మించారు. ఏఎజూ సముదాయించి ఆయనను సీతారాంపేట గేటు వరకు గ్రామానికి తీసుకువచ్చారు. ఇదే క్రమంలో రోడ్డుపైకి వెళుతున్న క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయా గల్లిలో డబ్బులు పంపిణీ చేస్తున్న విషయాన్ని గమనించి బీఆర్ఎస్ కార్యకర్తలు వారిని పడుకునేందుకు ముందుకు ఉరికారు.

# జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు సర్వం సిద్ధం



పెద్దవూర :అమృత్ తెలంగాణ: నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలం చింతపల్లి గ్రామం లో తెలంగాణ తొలి దళితకవి దున్న ఇద్దాసు ఆరాధనోత్సవాల సందర్భంగా నేటినుంచి జరిగే జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు ఆలయ కమిటీ బుధవారం అంతా సిద్ధం చేశారు. దున్న ఇద్దాస్ ఆలయ ఛైర్మెన్ ఎస్కే అబ్బాస్,సర్పంచి జాటావత్ రవి నాయక్, మాజీ సర్పంచ్ సుంకిరెడ్డి ప్రభావతి సంజీవరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ భారతి కొండలు ఆధ్వర్యంలో కబడ్డీ గ్రౌండు అందంగా ముస్తాబు చేశారు. ఈ పోటీలు పార్టీలకు అతీతంగా జరుగ నున్నాయి. ఈ పోటీలు మ్యాట్ పై మూడు రోజుల పాటు డే అండ్ నైట్ జరుగనున్నాయి. ఈ పోటీకు జాతీయ స్తాయిలో 14 టీములు పాల్గొన్నాయి. ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి రూ. 1,00,000/- రెండో బహుమతి రూ. 75,000/- మూడో నాలుగో, బహుమతి రూ. 50,000/- ఐదవ బహుమతి 40,000/- ఆరో బహుమతి 30,000/- ఇవ్వాలని దేవాలయ కమిటీ నిర్ణయించింది.


# నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి..



జన్నారంఅమృత్ తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, గురువారం నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జన్నారం మండల సీపీఐ(ఎం) పార్టీ కార్యదర్శి కొండగుర్ల లింగన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక, వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలను ఉపసంహరించు కునేలా కార్మిక వర్గం ప్రతిఘటనకు పూనుకోవాలని, లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకు ఐక్యంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని, కార్మికులకు కర్షకులకు విజ్ఞప్తి చేశారు. సమ్మెతోనే పాలకవర్గానికి సమాధానం చెప్పాలని 2026 ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో రాష్ట్రంలో అన్ని స్థాయిలోని అన్ని కార్మిక సంఘాలు వాటి అనుబంధ యూనియన్ల యావత్ కార్మికులు భాగస్వామ్యం కావాలని కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

కార్మిక వర్గం ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు కే బుచ్చయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అంబటి లక్ష్మణ్, మండల నాయకులు దాసండ్ల రాజన్న, వ్యవసాయ పాల్గొన్నారు.

# బాలీవుడ్ లో బడా నిర్మాణ సంస్థలో మాళవిక



సినిమా తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. తమిళ నటి మాళవిక మోహనన్ ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో నటించింది లేదు. కానీ తెలుగు ఆడియన్స్ ను మాళవిక సుపరిచితురాలే. మాళవిక నటించిన ఎన్నో డబ్బింగ్ సినిమాలను తెలుగు ఆడియన్స్ ఇప్పటికే చూసేశారు. మాళవిక ఇండస్ట్రీలోకి వచ్చి ఆల్రెడీ పదేళ్లు దాటుతోంది. పదేళ్ల తర్వాత అమ్మడు ఇప్పుడు తెలుగులో సినిమా చేస్తుంది. మారుతి దర్శకత్వంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ సినిమాలో మాళవిక లీడ్ రోల్ లో నటిస్తోంది. రాజా సాబ్ తర్వాత మాళవికకు తెలుగులో మరిన్ని ఛాన్సులు క్యూ కడతాయని అందరూ అంటున్నారు. ఇదిలా ఉంటే మాళవిక గతేడాది యుద్ర అనే సినిమాతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో ఆడియన్స్ ను మెప్పించలేకపోయింది. ఇదిలా ఉంటే మాళవిక ఇప్పుడు మరో బాలీవుడ్ సినిమాకు సైన్ చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. రొమాంటిక్ కామెడీ జానర్ లో రూపొందనున్న ఓ భారీ ప్రాజెక్టుకు మాళవిక సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఓ భారీ నిర్మాణ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని టాక్ వినిపిస్తోంది.

# 'సింగిల్స్'తో హాట్ లేడీ ఇక ట్రాక్‌లోకి వచ్చేసినట్టేనా?



డబుష్మాష్ వీడియోలతో నెట్టింట పాపులర్ అయిన ఢిల్లీ భామ కేతికశర్మ. సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్‌గా మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్న కేతిక వెర్సటైల్ డైరెక్టర్ పూరి దృష్టిని ఆకర్షించి తొలి అవకాశాన్ని దక్కించుకుంది. పూరి తనయుడు ఆకాష్ పూరి హీరోగా నటించిన రొమాంటిక్ మూవీతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించింది. కానీ తొలి మూవీతో హాట్ బేబీగా గుర్తింపుని తెచ్చుకుందే కానీ హిట్‌ని మాత్రం దక్కించుకోలేకపోయింది. హాటీగా పూర్తి ఎఫర్ట్ పెట్టినా కథ, కథనాలు ఆకట్టుకోలేకపోవడంతో కేతికకు తొలి అడుగులోనే పరాభవం ఎదురైంది. ఆ తరువాత నాగశౌర్యతో చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్‌తో చేసిన రంగ రంగ వైభవంగ కూడా అదే కోలలో చేరి కేతికని తవ్రంగా నిరాశకు గురి చేసింది. పవర్‌స్టార్‌తో కలిసి సాయిధరమ్ తేజ్ చేసినబ్రో కూడా కేతిక కెరీర్‌ని ట్రాక్‌లో పెట్టలేకపోయింది. అయితే ఇటీవల నితిన్ నటించిన రాబిన్ హుడ్ లో అదిదా సర్‌ప్రైజ్ అంటూ ఐటమ్ నంబర్‌లో హీటెక్కించింది. శేఖర్ మాస్టర్ వివాదాస్పద స్టెప్పులతో వార్తల్లో నిలిచింది. సినిమా హిట్ కాకపోయినా కేతికని మాత్రం వార్తల్లో నిలిపేలా చేసింది. అయితే కేతిక ఐటమ్ నంబర్లకే పరిమితమా? హీరోయిన్‌గా సక్సెస్‌ని దక్కించుకోలేదా? అనే కామెంట్‌లు వినిపించాయి. ఎంతగా ప్రయత్నించినా తనకు కమర్షియల్ విజయం లభించకపోవడంతో కేతిక కూడా కొంత నిరుత్సాహానికి గురైంది. అయితే తాజాగా శ్రీవిష్ణుతో కలిసి చేసిన సింగిల్ రీసెంట్‌గా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. హీట్ సమ్మర్‌లో కూల్‌హిట్‌గా నిలిచి శ్రీవిష్ణుతో పాటు కేతికకు, లవ్ టుడే ఫేమ్ ఇవానకు మంచి విజయాన్ని అందించింది. చాలా రోజుల తరువాత కేతిక శర్మకు సింగిల్ తో సక్సెస్ లభించింది. దీంతో హాట్ లేడీగా పేరు తెచ్చుకున్న కేతిక ఇక ట్రాక్‌లోకి వచ్చేసినట్టేనా? అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న సింగిల్ వసూళ్ల పరంగానూ మంచి ఫిగర్లని నమోదు చేస్తుండటంతో ఇక కేతిక కెరీర్ టర్న్ అయినట్టేనని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఈ మూవీ తరువాత కేతిక తమిళ డైరెక్టర్ రాజేష్ ఎం. సెల్వ డైరెక్షన్‌లో ఓ మూవీ చేస్తోంది. ఇది కూడా హిట్ అనిపించుకుంటే తెలుగులో కేతికకు ఇక తిరుగుండదన్నమాటే.

# 200 కోట్ల బడ్జెట్ తో దేవరకొండ సినిమా!



ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం మైత్రీ మూవీ మేకర్స్ 200 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు నిర్మాణ వర్గాల నుంచి తెలిసింది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఓ చిత్రం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. 'కింగ్ డమ్' రిలీజ్ అనంతరం విజయ్ ఈ సినిమానే పట్టాలెక్కిం చనున్నాడు. బ్రిటీష్ కాలం నేపథ్యంలో సాగే స్టోరీ ఇది. 1854-1878 మధ్య జరిగిన చారిత్రాత్మక సంఘట నలు ఆధారంగా రూపొందిస్తున్నారు. భారీ కాన్వాస్ పై పిరియాడిక్ చిత్రంగా రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొన్నాళ్లుగా రాహుల్ ఇదే పనిలో ఉన్నాడు. ఇప్పటికే విజయ్ ద్యాన ముద్రలో ఉన్న పోస్టర్ ను కూడా రిలీజ్ చేసారు. పోస్టర్ తోనే ఓ రేంజ్ లో హైప్ క్రియేట్ అయింది. పాన్ ఇండియా స్థాయిలో ఇప్పటి వరకూ ఎవరూ తెరకెక్కించని పాయింట్ ని తీసుకుని తెరకెక్కిస్తున్నారు? అన్నది అర్దమైంది. బలమైన కథ, క థనాలతో రూపొందుతున్న చిత్రంగా అప్పుడే ప్రచారం పీక్స్ కి చేరింది. మరి ఈ పాన్ ఇండియా సినిమా బడ్జెట్ ఎంత అన్నది ఇంతవరకూ ఎక్కడా బయటకు రాలేదు. కథని బట్టి బట్టి బడ్జెట్ కూడా భారీగా ఉంటుందని ఓ అంచనా తెరపైకి వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం మైత్రీ మూవీ మేకర్స్ 200 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు నిర్మాణ వర్గాల నుంచి తెలిసింది. సినిమాలో సెట్స్ కోసమే 70 కోట్లకు పైగా ఖర్చు అవుతుందిట.




# బికినీ బ్యూటీ సోనాల్ పర్ఫెక్ట్ టోన్డ్ లుక్



బాలయ్య-బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది సోనాల్ చౌహాన్ పరిచయం అవసరం లేదు. బాలయ్య-బోయపాటి కాంబినేషన్ సినిమాల్లో నటించిన ఈ ముంబై బ్యూటీ కెరీర్ లో కొన్ని చెప్పుకోదగ్గ బ్లాక్ బస్టర్లను అందుకుంది. అయితే సక్సెస్ ఉన్నా ఈ భామకు ఏదీ కలిసి రాలేదు. ప్రభాస్ ఆదిపురుష్ చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఈ బ్యూటీ బంగ్లాదేశ్ కి చెందిన ప్రముఖ పంపిణీదారుడు నిర్మిస్తున్న ఓ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీలో ఛాన్స్ కల్పించాడు. థర్డ్ పేరుతో ఈ మూవీ డాలీవుడ్ (బంగ్లాదేశ్) లో విడుదల కావాల్సి ఉంది. అయితే దానికి సంబంధించిన సరైన అప్ డేట్ లేదు. సౌత్ లో అన్ని పరిశ్రమలతో సంబంధాలు ఉన్నా, హిందీ పరిశ్రమను సోనాల్ ఎప్పటికీ వదిలిపెట్టదు. తాజాగా సోనాల్ చౌహాన్ షేర్ చేసిన ఫోటోషూట్ ఒకటి అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. సోనాల్ మతిచెడే బికినీ ఫోటోషూట్ లో టోన్డ్ లుక్ తో ఆకట్టుకుంది. తన కళ్లకు అందమైన బ్లాక్ రేబాన్ ని ధరించి మోడ్రన్ టచ్ ఇచ్చింది. బికినీపై మెస్సీ స్లిప్ ఆన్ డ్రెస్ ధరించిన చౌహాన్ రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. సోనాల్ స్పెషల్ ఫోటోషూట్ వేగంగా యూత్ లోకి దూసుకెళుతోంది. వరుస ఫోటోషూట్లతో గ్యాప్ లెస్ గా సోనాల్ ప్రయత్నం చూసి, తిరిగి టాలీవుడ్ అవకాశాలు కల్పిస్తుందేమో చూడాలి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com